

# గ్రీన్ కార్డ్

## - మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 2000 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

15

**సెవన్ ఎలివెన్‌లో** గంటకి అయిదు డాలర్ల డెబ్బై అయిదు సెంట్ల చొప్పున చేరాడు విరించి. ఓ వారంలో నలభై గంటలు మించి పనిచేస్తే ఓవర్ టైంగా ఒకటిన్నర రెట్లు ఉద్యోగస్థుడికి చెల్లించాలి.

రోజుకి విరించి పన్నెండు గంటలు చొప్పున పనిచేయసాగాడు. చేస్తానంటే వద్దనరు. అమెరికాలో పుట్టి పెరిగిన వారు, ముఖ్యంగా నీగ్రోలు పని విషయంలో బద్ధకస్తులు. సోషల్ సెక్యూరిటీ ద్వారా నిరుద్యోగ భత్యం అందుతుంటుంది. కాబట్టి కష్టపడి సంపాదించాలన్న ఆలోచన వారికుండదు. భవిష్యత్ కోసం దాచుకోవాలన్న తపన కూడా వారిలో తక్కువ.

మెడికల్ ఎమర్జన్సీకి మెడికేర్ ఇన్సూరెన్స్ వాళ్ళకి రక్షణ యిస్తుంది. ముసలితనంలో ఆదుకునే హోమ్స్ ఫర్ ది ఏజ్డ్ చాలా వుంటాయి. కూడబెట్టి పిల్లలకివ్వాలన్న ఆలోచన అసలే వుండదు పదహారు, పదిహేడు ఏళ్ళు వచ్చాక వాళ్ళ చదువుకి పిల్లలు వాళ్ళే సంపాదించుకోవాలి.

అందుచేత ఎప్పుడు పనిచేసే మనుషుల కొరత వుండే సెవెన్ ఎలివెన్‌లో విరించి రోజుకి పన్నెండు గంటలు పనిచేయడానికి అలా అవకాశం దొరికింది.

వారానికి అతని సంపాదన సగటున అయిదు వందల డాలర్లు. అంత వచ్చేలా చూసుకుంటూ శనాదివారాలు కూడా పనిచేస్తున్నాడు. సోమవారం ఆఫ్ తీసుకుంటాడు. చట్టరీత్యా అది తప్పదు కాబట్టి.

దివాకర్ అతనికి ఓ ఫ్లాట్ చూపించాడు. అందులోని అపార్ట్‌మెంట్‌లో ముగ్గురున్నారు. ఇద్దరు విద్యార్థులు, ఒకరు ఉద్యోగి. నాలుగో అతను ఈస్ట్‌కి మూవ్ అవడంతో వేకెన్సి ఏర్పడటంవల్ల వాళ్ళు విరించిని చేర్చుకున్నారు. ఒకరు మలయాళీ, ఇద్దరు నార్త్ ఇండియన్స్.

ఫ్లాట్‌కి అద్దె నాలుగువందల డాలర్లు. భోజనానినికి మూడువందల డాలర్లు. ఇతర ఖర్చులు వంద డాలర్లు. నెలకి తొమ్మిది వందల డాలర్లు మించి ఖర్చవదు. మిగిలిన పదకొండు వందల డాలర్లు సేవింగ్స్.

మూడునెలల్లో ఎనిమిదివందల డాలర్లు పెట్టి సెకండ్ హేండ్ కారొకటి కొన్నాడు. దానికి పెట్రోల్‌కి, ఇన్‌సూరెన్స్‌కి నెలకో వంద డాలర్లు అదనంగా ఖర్చవుతుండడంతో రోజూ ఇంకో గంట అదనంగా పని చేయసాగాడు.

నెలనెలా వెయ్యి డాలర్లు ఇంటికి పంపుతున్నాడు. తనని అమెరికా పంపడానికి అయిన ఖర్చు తీసుకోమని గోపీనాథ్‌కి ఇ - మెయిల్ చేశాడు. గోపీనాథ్ దేనికి ఎంతెంత ఖర్చు పెట్టాడో వివరంగా లెక్కలు ఓ కాగితం మీద రాసి పంపాడు విరించికి. అమెరికా

వస్తున్న ఒకరికిచ్చి ఆ దేశంలో పోస్ట్ చేయమని కోరాడు గోపీనాథ్. అంచేత గోపీనాథ్ రాసిన నాలుగో రోజుకల్లా విరించి చేతికి అందింది ఆ కాగితం.

మానసికి రోజూ ఓ ఇ - మెయిల్ యిస్తూనే వున్నాడు. ఆమె నించీ జవాబు వస్తోంది వెంట వెంటనే.

ఆమెకి తన జీవిత విధానాన్ని డైరీలో రోజూ రాసి పంపిస్తున్నాడు విరించి. తను నిత్యం గమనించే, ఆసక్తిగా వుండే కొత్త విషయాలు రాస్తుంటాడు.

ఇవాళ టి.విలో ఎన్నో ఛానల్స్‌ని ఓ నిముషంపాటు మార్చి చూసాను. తుపాకి కనపడే సీరియల్స్ ఇరవైనాలుగు.

అమెరికా దేశం రాజధాని పేరు నాతో పనిచేసే ఇరవై నాలుగుమంది అమెరికన్స్‌లో ముగ్గురికి తెలీదు.

అలాగే ఎవరికి అమెరికా జనసంఖ్య తెలీదు.

పెర్షియన్ గల్ఫ్‌లో అమెరికా ఇటీవల యుద్ధం చేసింది కదా. వరల్డ్ మేప్‌లో ఇరాక్ దేశాన్ని ఎవరూ గుర్తించలేకపోయారు.

ఇరవై నాలుగు మందిలో అందరికీ అమెరికా కనిపెట్టింది కొలంబస్ అని తెలుసు. కానీ అతను మన ఇండియాకి దారి కనిపెట్టడానికి బయలుదేరి అమెరికానే ఇండియా అనుకుని పొరబడ్డాడని తెలీదు.

అంతేకాదు. నేషనల్ జియోగ్రాఫిక్ మేగజైన్ ప్రకారం ప్రతి ఏడుగురు అమెరికన్స్‌లో ఒకరు అంటే రెండు కోట్ల, నలభై లక్షలమంది వరల్డ్‌మేప్‌లో అమెరికాని గుర్తించలేరట.

ఇప్పుడు ఇ మెయిల్ లో ముద్దుల గురించిన ప్రసక్తే వారి మధ్య రావడంలేదు. ఇంటలెక్చువల్ టాపిక్స్ అధికంగా చోటు చేసుకుంటున్నాయి. తనకి పరిచయం అవుతున్న అమెరికా గురించి ప్రతిదీ వివరిస్తాడు విరించి మానసికి.

''ఇక్కడ సగం మంది ధ్యేయం ఇంకా ఐశ్వర్యవంతులవడం. అందులో పడి సతమతమవుతుండటం చూస్తూంటే నవ్వొస్తూంటుంది. మిగిలిన సగంమందిలో ఎక్కువభాగం బద్ధకస్తులు లేదా వున్నదాంతో తృప్తిపడేవారు.''

ఆ రాత్రి సునీత ఫోన్ చేసి చెప్పింది విరించికి.

''నీకు ఐ.ఎన్.ఎస్ నించి ఓ కవరు వచ్చింది. నీ కొత్త ఎడ్రస్ వాళ్ళకి ఇన్‌ఫాం చేయలేదా?''

''లేదు. రేపు రాత్రి వచ్చి తీసుకుంటాను.''

''ఏకంగా భోజనానికే రా.''

''అలాగే.''

మర్నాడు సునీత ఇంటికి వెళ్తూ పిల్లలకి హెర్షి కిసెస్ (చాక్‌లెట్లు) తీసుకెళ్ళాడు.

ఐ.ఎన్.ఎస్ నించి వచ్చిన ఆ కవరు చదివి చెప్పాడు దివాకర్‌కి విరించి.

''పధ్నాలుగో తారీఖు వుదయం తొమ్మిదికి నా అప్లికేషన్ మీద హియరింగ్‌కి రమ్మని.''

''నీవు అది సబ్‌మిట్ చేసి ఆర్నెల్లు కాలేదనుకుంటా?'' అడిగింది సునీత.

''లేదు''

''ఏడాదిన్నర దాటినా కొందర్ని పట్టించుకోవడంలేదు. ఎందుకనో నీ అప్లికేషన్‌ని త్వరగా పర్ సూ చేస్తున్నారు?'' కొద్దిగా ఆందోళనగా చెప్పింది సునీత.

''కేర్ ఫర్ స్కాచ్?'' అడిగాడు దివాకర్.

''ఊహూ. కారు డ్రయివ్ చెయ్యాలిగా. బీరు తీసుకుంటాను.''

"గుడ్ జాగ్రత్త వుండటం మంచిది. కాప్(పోలీసులు) పట్టుకుంటే టికెట్టో, సైటేషనో తప్పదు" చెప్పింది సునీత.

బీర్ తాగుతూ భోజనం చేశాక ఓ తమాషా చేశాడు సునీత పెద్దకొడుకు.

విరించి బాత్‌రూంలోకి వెళ్ళాడు. యూరిన్ పాస్‌చేసి, ఫ్లష్‌ని లాగి బయటికి వచ్చాడు. ఎదురుగా కుర్చీమీద కేమ్‌కార్డర్‌ని పెట్టి దానికున్న వ్యూ పేనల్‌లోకి చూస్తూ పకపకా నవ్వుతున్నాడు రాఖేష్. ఖాళీ బాత్‌రూం అందులో కనిపిస్తోంది. ఆ కేమ్‌కార్డర్ కున్న వైర్ బాత్ రూంలోకి వెళ్ళడం చూశాడు. వారితోపాటు దివాకర్ కూడా చూస్తూ నవ్వుతూ చిన్నగా ఏదో కామెంట్ చేస్తున్నాడు.

తను బాత్‌రూంలో వుండగా జరిగిందంతా అందులో చూసాడని గ్రహించాడు విరించి కేమ్‌కార్డర్‌కున్న వైర్ బాత్‌రూంలోకి వెళ్ళడంతో.

విరించి వచ్చిన అలికిడి విని తలతిప్పి చూసి రాఖేష్ ఫక్కున నవ్వాడు. విరించి సిగ్గుపడుతూ అడిగాడు.

"వై ఆర్ యూ స్పయింగ్ ఆన్ మీ?"

"అక్కడ ఏమేం చేసావో చూసాంలే" చెప్పాడు శతృఘ్న ఇంగ్లీష్‌లో.

వయసులో వున్న విరించి బాత్‌రూంని ఇంకో పనికి కూడా వాడుతుంటాడు. దాంతో బిక్కచచ్చిపోయాడు. సునీత వాళ్ళ దగ్గరకి వచ్చి సిగ్గుతో చితికి ఎర్రబడ్డ విరించి మొహం చూసి నవ్వుతూ చెప్పింది.

"కంగారు పడకు విరించి. వాళ్ళేం చూడలేదు బాత్‌రూంలో ఏం జరిగిందో."

"ఎందుకు చూడలేదు? అదిగో ఖాళీ బాత్‌రూం ఇంకా కనిపిస్తోంది" చెప్పాడు విరించి.

నవ్వాపుకోలేక ఇంకా గట్టిగా నవ్వాడు దివాకర్.

"మీరూర్కోండి. నిజం అనుకుంటాడు" అని భర్తతో చెప్పి విరించితో చెప్పింది సునీత.

"వీళ్ళు నిన్ను ఫూల్ చేయడానికిదంతా. ముందే కేమ్‌కార్డర్‌లో ఖాళీ బాత్‌రూంని రికార్డు చేసి ఆ కేసెట్‌ని నువ్వొచ్చే టైంకి ప్లే చేస్తున్నారు. బాత్‌రూంలో ఏం జరిగేదీ కనిపిస్తోందన్న షో వస్తుంది అందులోంచి బయటికి వచ్చిన వాళ్ళకి, ఆ ఖాళీ బాత్‌రూం కనిపిస్తూండటంతో ఆ వైరుని బాత్‌రూంలోకి వెళ్ళేలా పెట్టడంతో అనుమానం కన్‌ఫాం అవుతుంది అంతే."

"నిజంగా అంతేనా?" అడిగాడు విరించి.

"నిజంగా అంతే అంకుల్. నిన్ను కాసేపు ఫూల్ చేయనివ్వకుండా అమ్మ ముందే అంతా చెప్పేసింది" కేమ్‌కార్డర్‌ని ఆఫ్ చేసి చెప్పాడు రాఖేష్.

"థాంక్‌గాడ్" నిట్టూర్చాడు విరించి. ఆ వైరు ముక్కని లాగి చూస్తే అది లోపల దేనికీ కనెక్ట్ చేయబడలేదు.

"కేమ్‌కార్డర్ ఎలా పనిచేస్తుందో తెలిసిన వాళ్ళు కూడా ఈ ట్రిక్‌తో బోల్తా పడతారు" చెప్పాడు దివాకర్ నవ్వుతూ.

పధ్నాలుగో తారీఖు వుదయం ఎనిమిది ముప్పావుకల్లా విరించి ఐ.ఎన్.ఎస్ ఆఫీస్‌కి వెళ్ళాడు. రిసెప్షనిస్ట్ అతనికొచ్చిన లెటర్‌ని చూసి చెప్పింది.

"ప్లీజ్ బి సిటెడ్ ఐ విల్ కాల్ యువర్ నేమ్"

విరించి కూర్చున్నాక అతని పక్కనే వున్న ఏషియన్ పలకరించాడు విరించిని హిందీలో.

"మీది బంగ్లాదేశా?"

"కాదు. ఇండియా. మీరు పొలిటికల్ అసైలమ్‌కే అప్లై చెసారా?" అడిగాడు విరించి.

"అవును. నా ఇంటర్వ్యూ మూడు రోజుల నించి అవుతోంది."

"అన్నిరోజులా?" ఆశ్చర్యపోయాడు విరించి.

"దే ఆర్ గ్రిల్లింగ్ మి. నన్ను ప్రశ్నించే స్టీఫెన్ బ్రూన్ సామాన్యుడు కాడు. ఆవులిస్తే పేగులు లెక్కపెడతాడు."

"ఓ?"

"అతను అబద్ధాలని పసిగట్టడంలో అందె వేసిన చెయ్యి. దురదృష్టవశాత్తూ అతనే తగిలాడు నాకు."

తనని పిలిచాక ఐ.ఎన్.ఎస్ అధికారి ముందుకు వెళ్ళి కూర్చున్నాడు విరించి.

"హలో. ఐ యామ్ స్టీఫెన్ బ్రూక్" చెయ్యి చాపుతూ చెప్పాడు అతను.

అతనితో కరచాలనం చేసాడు విరించి.

"నీకు పెళ్ళి కాలేదన్నమాట?" అడిగాడు రాబర్ట్ బ్రూక్.

"నో సర్."

"కట్ అవుట్ ది సర్ బిజినెస్. వి ఆర్ ఫ్రెండ్స్. ఓకే?" నవ్వుతూ చెప్పాడు బ్రూక్.

"ఓకే."

"నిన్ను తిరిగి ఇండియాకి పంపిస్తే నీకు వచ్చేనష్టమేమిటి? నీకు అమెరికాలో పొలిటికల్ అసైలమ్ ఎందుకివ్వాలి? " అడిగాడతను.

"నా ప్రాణాలకి ముప్పు వస్తుంది కాబట్టి."

"ఎవరినించి? నక్సలైట్లనించా? ఎల్.టి.టి. ఇ నించా? లేక లోకల్ గూండాలనించా?"

ఆ ఆఫీసర్‌కి ఇండియాలోని టెర్రరిస్ట్ గ్రూపుల గురించిన మొత్తం సమాచారం తెలుసుననీ, ప్రతిదినం వివిధ టెర్రరిస్టుల గ్రూప్‌లకి సంబంధించిన మొత్తం సమాచారం ఇతనికి అందుతుందని విరించికి తెలుసు. గోపీనాథ్ చెప్పాడు. ఈ ఇంటర్వ్యూని ఎలా ఎదుర్కోవాలో విరించిని బ్రీఫ్ చేస్తూ..

"సాధారణంగా పొలిటికల్ అసైలమ్ అప్లికేషన్స్‌ని పరిశీలించే వాళ్ళంతా తాము ఇంటర్వ్యూ చేసే వ్యక్తి దేశానికి సంబంధించిన అన్ని టెర్రరిస్టు గ్రూపులలో ముఖ్యమయిన వారి పేర్లు, వాళ్ళ రాజకీయ భావాలు, ఎందుకు పోరాటం సాగిస్తున్నారు, మొదలయినవి వీళ్ళకి కంఠతాపాఠం. అలాగే వాళ్ళు రాసే బెదిరింపుల నమూనాలు, హత్యలని ఏ కమిటీ ఏ కారణాలవల్ల నిర్ణయిస్తుంది. చంపే విధానాలు మొదలయినవన్నీ వాళ్ళు స్టడీ చేసివుంటారు. ఇందువల్ల వాళ్ళు అభ్యర్థి చెప్పే దాంట్లో నిజానిజాలు గ్రహించగలరు. ప్రపంచంలోని ప్రతి అమెరికన్ ఎంబసి, కన్సులేట్‌ల నించి అమెరికాలోని ఐ.ఎన్.ఎస్ శాఖకి నిత్యం ఆరోజు దినపత్రికలు అందుతుంటాయి. రిసెర్చ్ విభాగం వారు వాటిని చదివి టెర్రరిస్టులకు చెందిన వార్తలతో ఫైల్స్ బిల్డప్ చేస్తారు.

బ్రూక్‌కి ఇండియాలో ఆపరేట్ చేస్తున్న పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐ.ఎస్.ఐ గురించి ఎంత తెలుసో విరించికి తెలీకపోయినా, అది గూఢచారి సంస్థ గనుక తమ ఏక్టివిటీస్‌ని ఎంతో రహస్యంగా వుంచుతుందని విరించి నమ్మాడు. దాంతో అతనికి ఎక్కువ తెలిసే అవకాశం లేదనుకున్నాడు.

నిజానికి గోపీనాథ్ తన తమ్ముడు విరించికి నక్సలైట్లు లేదా ఎల్.టి.టి.ఇలాంటి స్వదేశీ టెరరిస్టుల గ్రూప్‌ల నించి ప్రాణభయం వుందని కాక ఐ.ఎస్.ఐ పేరుని ఉపయోగించుకోవడానికి కారణం అదే వారి ఏక్టివిటీస్ అత్యంత గోప్యంగా వుంచుతారు.

"నిన్నెందుకు చంపాలనుకుంటున్నారు ఐ.ఎస్.ఐ. ఏజెంట్లు?" అడిగాడు బ్రూక్ విరించి అప్లికేషన్‌ని శ్రద్ధగా పరిశీలించాడు కాబట్టి.

తను జెరాక్స్ షాపుని నడుపుతున్నానని, ఓరోజు ఎవరో కొన్ని ముఖ్యమయిన పత్రాలు ఎక్కడో పారేసుకుని, తన దుకాణంలో పోయాయని అనుమానపడ్డారని, తనకేం తెలీదంటే నమ్మక తనని చంపడానికి అది యివ్వలేమని చెప్పారని, కనీసం రివాల్వర్ లైసెన్స్ కూడా యివ్వడానికి నిరాకరించారని, యిక ఇండియాలో వుంటే తనకి మరణం తప్పదని నిశ్చయించుకుని తన ప్రాణాలని భారత

ప్రభుత్వం కాని, తనున్న రాష్ట్రప్రభుత్వంకానీ రక్షించదనుకుని అమెరికాకి పారిపోయి వచ్చేశానని చెప్పాడు. తనకి అమెరికన్ విజిటర్స్ వీసా దొరకదు కాబట్టి బిజినెస్ వీసాని కన్‌సులేట్‌ని మాయచేసి తీసుకున్నానని కూడా వివరించాడు.

దాదాపు గంటన్నరపాటు విరించి చెప్పే ఆ కథంతా మౌనంగా వింటూ, మధ్య మధ్యలో పాయింట్స్‌ని యెల్లో పేడ్‌లో నోట్ చేసుకుంటుండిపోయాడు రిచర్డ్ బ్రూక్. మధ్యలో డిస్‌పోజబుల్ కప్స్‌లో ఇద్దరికీ కాఫీ రెండుసార్లు వచ్చింది.

విరించి చెప్పడం ఆపాక తను రాసుకున్న పాయింట్స్ వంక చూసుకుని రిచర్డ్ బ్రూక్ కొన్ని ప్రశ్నలు అడిగాడు. దాదాపు ఆ యాభై ప్రశ్నలకి విరించి సమాధానాలు అతనికి తృప్తికరంగా చెప్పాడు. ఆ ప్రశ్నలన్నీ గోపీనాథ్ ముందు విరించిని ప్రిపేర్ చేసినవే కాబట్టి ఇబ్బంది లేకపోయింది. జిరాక్స్ మెషీన్ తయారు చేసిన కంపెనీ పేరు, దాన్ని ఎలా ఆపరేట్ చేయాలి, నెలసరి ఆదాయం ఎంత, అయిదువందల పేపర్ల కట్ట ఖరీదెంత మొదలయిన ప్రశ్నలవి.

అప్లికేషన్‌తో పాటు విరించి జతచేసిన వివిధ దినపత్రికల జిరాక్స్ కాపీలని స్కేన్ చేసి రిచర్డ్ బ్రూక్ అమెరికన్ కన్‌సులేట్‌కి ఇ మెయిల్ ద్వారా అటాచ్‌మెంట్‌గా పంపాడు, వాటిని వెరిఫై చేయమని వారం క్రితమే కన్‌సులేట్ నించి జవాబొచ్చింది. ఆ వార్తలన్నీ ఆయా దినపత్రికల్లో నిజంగా వున్నవేనని, కొంతమంది అభ్యర్థులు గతంలో సబ్‌మిట్ చేసిన న్యూస్ పేపర్ కటింగ్స్‌ని వాళ్ళు ఇన్‌ఫ్లూయెన్స్‌తో దినపత్రికల ప్రెస్‌లో కేవలం యిక్కడ సబ్‌మిట్ చేయడానికే ప్రింట్ చేయించినవి ఐ.ఎస్.ఐ నోటీస్‌కి వచ్చాక ప్రతి వార్తని ఈ విధంగా నిజంగా ఆ దినపత్రికలో ఆ తేదీన వచ్చిందో లేదో క్రాస్ చెక్ చేస్తున్నారు.

సినిమాలో ఓ దృశ్యం చిత్రీకరించడానికని దినపత్రికాధిపతులకి చెప్పి, తమకి కావలసిన న్యూస్‌ని దినపత్రిక ప్రెస్‌లో ప్రింట్ చేసుకునే అవకాశం వుండటం కూడా అలా క్రాస్ చెక్ చేయటానికి కారణం.

అతనడిగిన అన్ని ప్రశ్నలకు అతనికి తృప్తికరంగా జవాబులు యిస్తుండటంతో విరించిలో కాన్ఫిడెన్స్ పెరగసాగింది. తన అబద్ధపు కథని రిచర్డ్ బ్రూక్ తేలిగ్గా నమ్మేస్తున్నాడని, ఒకే ప్రశ్నని వివిధ కోణాల్లోంచి ప్రశ్నించాడు బ్రూక్. ఎలాంటి మార్పు లేకుండా అన్నిటికి ఒకే సమాధానం చెప్పాడు విరించి. అదో కొలబద్ద అబద్ధం చెప్పడం లేదన్నదానికి. విరించికి ప్రతీ జవాబు ప్రాక్టికల్‌గా మనసులో యింకెలా గోపీనాథ్ ప్రవర్తింపచేయడంతో అది సాధ్యమైంది.

సాయంత్రం నాలుగున్నరకి చెప్పాడు.

"ఓ.కే ఇంక ప్రశ్నలు లేవు. నీ సమాధానాలన్నీ సంతృప్తికరంగా వున్నాయి. నా అనుభవంలో చీట్స్ ఎక్కువమంది తగులుతుంటారు. కాబట్టి యింత వివరంగా ప్రశ్నించాల్సి వచ్చింది."

విరించి మనసులో ఆనందం పొంగిపొరలింది. బ్రూక్ కరచాలనం చేయడానికి చేతిని అందిస్తూ చెప్పాడు.

"కంగ్రాట్స్ అండ్ వెల్‌కం టు అమెరికన్ సిటిజన్ షిప్. "

విరించి అతని చేతిని అందుకుని కరచాలనం చేస్తూ చెప్పాడు.

"థాంక్స్ ఎలాట్ ఫర్ బీయింగ్ కన్‌సిడరేట్."

బయటకు వచ్చాడు విరించి. అతనికెంతో ఆనందంగా వుంది. ఇంటికెళ్ళగానే విరించి ఇండియాకి గోపీనాథ్‌కి ఫోన్ చేసి జరిగింది చెప్పాడు.

గోపీనాథ్ గర్వంగా చెప్పాడు.

"ఐ హేడ్ దెమ్ ఇడియట్స్."

ఆ రాత్రి దివాకర్ ఇంట్లో షాంపేన్ బాటిల్‌ని ఓపెన్ చేశారు. అది తాగుతూ విరించి గోపీనాథ్‌ని అమెరికా నించి ఓడలో ఇండియాకి డిపోర్ట్ చేయడం, గోపీనాథ్ ఓడలో ఆలోచించి ఓ పథకం రూపొందించడం, ఇండియాకి చేరుకున్నాక విరించి పొలిటికల్

అసైలమ్ అప్లికేషన్ తనకి జరిగినట్లుగా నిరాకరించబడకుండా ఓ కట్టుకథని అల్లి, దానికి సపోర్టింగ్‌గా తగిన సాక్ష్యాధారాలు కల్పించడం చిన్న వివరం కూడా మిస్ కాకుండా వివరించాడు. దాన్ని సునీత, దివాకర్ సింగ్‌లే కాక రాఖేష్ కూడా శ్రద్ధగా విన్నాడు.

ఆ సమయంలో రిచర్డ్ బ్రూక్ ఇంట్లో పిల్లల కాంపోజిషన్ పుస్తకాలని దిద్దుతున్న కేటీతో చెప్పాడు ఆమె బర్త బ్రూక్.

"ఇవాళ ఓ కేసుని అప్రూవ్ చేశాను. అతను పేరు విరించి."

"ఓ! ఏ దేశం అతను?"

"ఇండియా."

"ఇండియా? నా క్లాస్‌లో నలుగురు ఇండియన్ విద్యార్థులున్నారు."

టూకీగా విరించి కేసు గురించి వివరించాడు బ్రూక్.

"తప్పుడు అప్లికేషన్స్‌ని పట్టుకోవడంలో ఎలా జాబ్ సేటిస్ ఫేక్షన్ వుంటుందో అలాగే నిజమైన కేసులని అప్రూవ్ చేయడంలో కూడా ఆనందం వుంటుంది" చెప్పాడు బ్రూక్.

## 16

ఆ రోజు ఉదయం స్కూల్లో క్లాసు తీసుకున్నాక, కాంపోజిషన్ పిరియడ్ కాబట్టి పిల్లలకి అది రాయడానికి ఓ టాపిక్‌ని బోర్డుమీద రాసింది.

యువర్ గెస్ట్.

తర్వాత పిల్లలకి చెప్పింది.

"మీ ఇంటికి భోజనానికి గెస్టులెవరయినా వస్తుంటారు. మీతో వాళ్ళు టైం ఎలా స్పెండ్ చేశారో అయిదువందల మాటలు మించకుండా రాయండి."

చాలామంది పిల్లలు ఆలోచిస్తున్నారు. కానీ రాఖేష్ తక్షణం కాగితం మీద పెన్నుని వుంచాడు. ముందు హెడ్డింగ్ రాశాడు.

అవర్ గెస్ట్ - మిష్టర్ విరించి.

"విరించి - నీకే ఫోన్" చెప్పాడు ప్లేట్‌మేట్.

సునీత, దివాకర్‌లు తప్ప అతనికి ఫోన్ చేసేవారెవరూ వుండరు. రిసీవర్ అందుకుని చెప్పాడు.

"హాయ్. విరించి దిస్ ఎండ్"

"హాయ్. విరించి దిస్ ఎండ్" ఓ ఆడ కంఠం వెక్కిరింపుగా పలికింది అవతలవైపు నించి.

విరించి మాట్లాడలేదు, తను విన్న కంఠం కరెక్టేనా కాదా అన్న అయోమయంలో పడటంతో.

"హలో. కెన్ యు గెస్ హు ఈజ్ ఎట్ దిస్ ఎండ్?" అడిగిందా కంఠం మళ్ళీ.

"మానసి? నువ్వేనా?" అడిగాడు సంభ్రమంగా.

"చిత్తం."

"ఐయామ్ సో గ్లాడ్ టు యియర్ యువర్ వాయిస్. ఈ నంబరెలా తెలిసింది?"

"స్వతహాగా నేను మాట్లాడేది ఇండియానించి కాదు. సేనోజేనించి."

"ఓ గాడ్ ఈజిట్! ఎప్పుడొచ్చావ్ అమెరికాకి?"

"కొన్నిగంటల క్రితం."

"ఎలా వచ్చావు? ఏ వీసా మీద?"

"బి.వన్. నాకిక్కడ ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో జాబ్ దొరికింది. అఫ్‌కోర్స్ అది హైదరాబాద్ నించి పదిహేడేళ్ళ క్రితం ఇక్కడికి వచ్చిన ఓ తెలుగతను పెట్టిన కంపెనీనే. అతను మా బావ క్లాస్‌మేట్. నా గురించి చెపితే పేపర్లు పంపాడు. నీకు సర్‌ప్రయిజింగ్‌గా వుండాలని ముందు చెప్పలేదు."

"ముందు నీ ఫోన్ నంబరు చెప్పు" విరించి అది రాసుకున్నాక చెప్పాడు.

"రేపు శనివారం నేను ఫ్రీ. రేపు ఇంటికి వస్తాను. ఎడ్రస్ చెప్పు."

"రేపటిదాకా ఆగలేను బాబు. ఇవాళే రా."

"ఉద్యోగం చేస్తున్నాను. ముందు చెప్పకుండా డుమ్మా కొట్టకూడదిక్కడ."

"నేను అలిగానయితే."

"నీ అలకని రేపు వచ్చి చూస్తాను. ఎప్పటినుంచి జాయిన్ అవుతున్నావు?"

"వారందాకా మా అక్కకి నాకు బోలెడు కబుర్లు. అందుకని ఈ మండే కాక పై మండే నించి చేరుతున్నాను."

"వావ్! ఐ జస్ట్ కాన్ట్ బిలీవ్ ఇట్. నువ్వు నిజంగా ఇక్కడ నాకు వందమైళ్ళలోపు దూరంలో వున్నావా? వావ్! ఏమ్ ఐ సో గ్లాడ్"

"అమెరికాలో వున్న తెలుగువాళ్ళని చేసుకుంటే మా ఇంట్లో ఎవరూ అభ్యంతరం చెప్పరు. అది ఆలోచించే ఇక్కడికి వచ్చాను. ఐ.ఎన్.ఎస్. వాళ్ళ ఇంటర్వ్యూకి వెళ్ళావా? ఎలా జరిగింది?"

"వండ్రఫుల్. జస్ట్ వండ్రఫుల్. రెండు రోజులు వరసగా పిలిచారు. ఫైనల్‌గా సోమవారం ఉదయం తొమ్మిదికి వెళ్ళి కొన్ని కాగితాలపై సైన్ చేయాలి. తర్వాత జడ్జి దగ్గర ఓత్ తీసుకోవాలి. దానికి ఓ డేట్ ఇస్తారు. దాంతో అమెరికన్ సిటిజన్‌ని అయిపోతాను."

"విఠౌట్ గ్రీన్ కార్డ్?"

"యస్. విఠౌట్ గ్రీన్ కార్డ్. అది నీలాంటి బి వన్ వీసా గాళ్ళకి" నవ్వాడు.

ఇద్దరు దాదాపు గంటసేపు మాట్లాడుకుంటూనే వున్నారు అనేక విషయాలు.

"మనం కలిసినప్పుడు విల్ యు కిస్‌మీ?" అడిగాడు విరించి.

"నో. డూ యు నీడ్ ఇట్ బేడ్‌లి?" అడిగింది.

"ఇది అమెరికా. ఇక్కడ కిస్సింగ్ ఇన్ పబ్లిక్ అలౌడ్ కదా పిల్లా.."

"విరించి నీకో విషయం చెప్పనా?"

"చెప్పు."

"ది కిస్ ఇన్ యువర్ ఐస్ హంట్స్ మి నైట్ అండ్ డే నీవు చూసే ఆ చూపుతోనే నన్ను ముద్దు పెట్టుకునే వాడివి కదా?"

"అఫ్‌కోర్స్"

మరో పావుగంట తర్వాత మర్నాడు ఉదయం ఎనిమిదిన్నరకి కలుస్తానని చెప్పి పెట్టేసాడు ఫోన్. అతనికెంతో హుషారుగా వుంది. అమెరికాలో సెటిల్ అవడం, మానసి సామీప్యం రెండు ఆనందకరమైన విషయాలే.

( ముగింపు వచ్చేనెలలో)

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

Post your comments